సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



మార్చి నుంచి పొగాకు కొనుగోళ్లు

జిల్లాలోని పొగాకు వేలం కేంద్రాల్లో మార్చి 9వ తేదీ నుంచి పొగాకు కొనుగోలు చేయనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. మంగళవారం కేంద్రాన్ని పరిశీలించారు. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,310
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,297
3 శాతం జీఎస్టీతో	రూ.5,456
నవర (8 గ్రా)	రూ.43,648

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.9 /22.0

జిల్లా వ్యాప్తంగా బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. గాలిలో తేమ 64 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఉదయగిరి పరిశీలకుడిగా మెట్టుకూరు



ముఖ్యమంత్రితో మెట్టుకూరు

నెల్లూరు (సెంట్రల్): ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా మెట్టుకూరు ధనుంజయరెడ్డిని పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగర మండలం లింగంగుంట పంచాయతీకి చెందిన మెట్టుకూరు ధనుజంయరెడ్డి గతంలో డీసీసీబీ చైర్మన్‌గా, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడిగా పనిచేశారు. ఇప్పటి వరకు ఉన్న కొడవలూరు ధనుంజయరెడ్డి ఉదయగిరి పరిశీలకుడిగా ఉన్నారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ధనుంజయరెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు.

తహసీల్దార్ల బదిలీలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ చక్రధర్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లకు అడ్‌హాక్ తహసీల్దార్లుగా ప్రమోషన్లు కల్పించి బదిలీ చేశారు. కలువాయి మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సోమ్లానాయక్‌ను బుచ్చిరెడ్డిపాళెంకు, రాపూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.శ్యాంసుందరరాజాను సీతారామపురానికి బదిలీ చేశారు. వెంకటాచలం మండలం డిప్యూ టీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుభాషిణికి ఉద్యోగోన్నతి కల్పించి రాపూరు తహసీల్దార్‌గా నియమించారు. సైదాపురం డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మిని అదే మండల తహసీల్దార్‌గా, సంగం మండల డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసన్నను అదే మండల తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు జాబ్‌మేళా

నెల్లూరు (మినీబైపాస్): కావలి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), డిస్ట్రిక్ ఎంప్లాయీమెంట్, ట్రైనింగ్, సొసైటీ ఎంప్లాయిామెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలెప్‌మెంట్ ఇన్ ఏపీ (ఎస్ఈఈడీఏపీ) సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ మేనకూరు సెజ్, శ్రీరామ్ సిటి యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ నెల్లూరు, దేవయాని ఇంటర్‌నేషనల్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, క్వెస్ క్రాప్ లిమిటెడ్, హావెల్స్ ఇండియా లిమిటెడ్, అపోలో ఫార్మసీ, హీరో మోటో కార్పొరేషన్, మెడికవర్ హాస్పిటల్స్, హెల్ప్ యువర్ నీడ్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, బీఫార్మా, డీఫార్మా చదివిన, 18 నుంచి 30 ఏళ్లలోపు అర్హులని, ఆసక్తి గలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎ.సురేష్ కుమార్ కోరారు.

సోమశిలలో 66.848 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం నాటికి 66.848 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 1558 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 3,920, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

తనకు రాజకీయ భిక్ష పెట్టి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన పార్టీపై టీడీపీ ట్రాప్‌లో పడి నిందారోపణలు చేసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా మారింది. టీడీపీతో లాలూచీ పడి ప్రభుత్వంపై 'ఫోన్ ట్యాపింగ్' నిందలు వేసి సొంత పార్టీపై ధిక్కార స్వరం వినిపించిన ఆయనకు తెలుగు తమ్ముళ్లు అడ్డుపడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సైతం జిల్లా టీడీపీ నేతల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని కోటంరెడ్డికి ముఖం చాటేసినట్లు తెలిసింది.



రెంటికీ చెడ్డ రేవడిలా..

- టీడీపీ ట్రాప్‌లో పడి సొంత పార్టీపై కోటంరెడ్డి నిందారోపణలు
- పార్టీలోకి రానివ్వద్దని బాబు వద్ద టీడీపీ నేతల మొర
- చేరదీస్తే పార్టీకి నష్టమంటున్న తమ్ముళ్లు
- పార్టీ నేతల అభిప్రాయానికి సరేనన్న చంద్రబాబు
- వెన్నంటే ఉంటామన్న కార్పొరేటర్ల తాజాగా ఝలక్
- వైఎస్సార్‌సీపీయే ముఖ్యమని తెగేసి చెప్పిన ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిస్థితి ప్రస్తుతం రెంటికీ చెడ్డ రేవడిలా తయారయింది. నిందారోపణలతో సొంత పార్టీలో స్థానం కోల్పోయిన ఆయన టీడీపీలో ఎంట్రీకి గేట్లు పడినట్లు తెలుస్తోంది. 'అయటగ్యయ్యో.. కోటంరెడ్డి.. పుట్టింట్లోళ్లు తరిమేశారు.. నమ్ముకున్నోళ్లు వదిలేశారు..' అన్నట్లు మారింది. నిన్నటి వరకు వెన్నంటి ఉంటామన్న కొందరు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు తమకు వైఎస్సార్‌సీపీయే ముఖ్యమని కోటంరెడ్డికి ఝలక్ ఇచ్చారు. తనకు తానుగా టీడీపీ నుంచి రూరల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని బాహాటంగా చెప్పుకున్న ఆయన్ను టీడీపీలోకి రానివ్వద్దంటూ జిల్లా తమ్ముళ్లు చంద్రబాబు వద్ద మొర పెట్టుకోవడంతో కోటంరెడ్డి పరిస్థితి రివర్స్ అయినట్లు తెలుస్తోంది. నిన్న.. మొన్నటి వరకు అధికార మదంతో ఘీంకరించి రౌడీమూకలతో దాడులు చేయించిన కోటంరెడ్డిని టీడీపీలోకి తీసుకుంటే పార్టీ పరువు పోతుందని, తర్వాత రాజకీయ పరిస్థితులను చంద్రబాబుకు వివరించడంతో ఆయన సైతం పార్టీ నేతల అభిప్రాయాలను పరిగణిలోకి తీసుకుని సరే అన్నట్లు సమాచారం. దీంతో టీడీపీ కోటంరెడ్డిని అక్కున చేర్చుకునే పరిస్థితి కనిపించడం లేదు.

ముందుగానే నో ఎంట్రీ

పార్టీ కండువా మారకముందే తానే టీడీపీ అభ్యర్థినని ప్రకటించుకోవడంపై టీడీపీ యకులు మూకుమ్మడిగా చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. వారం రోజులుగా కోటంరెడ్డి ఎపిసోడ్ పరిశీలిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు కూడా నో ఎంట్రీ అన్నట్లు తెలిసింది. కోటంరెడ్డి రాకను ఆ పార్టీ నాయకులే అడ్డుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. నిన్నటి వరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దౌర్జన్యకాండతో టీడీపీ నేతలను అల్లాడించాడని, కోటంరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తే పార్టీ నేతలు ఆయనతో కలిసి పనిచేయరని, పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోతుందని నేతలు తమ పార్టీ అధినేత వద్ద మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. మూడున్నర ఏళ్లుగా కోటంరెడ్డి చేసిన అవినీతి, అరాచకాలపై ప్రెస్‌మీట్లు పెట్టి దుమ్మెత్తి పోసిన అజీజ్, అతని మిత్రబృందం, పార్టీ కేడర్ ప్రస్తుతం కోటంరెడ్డిని పార్టీలోకి అహ్వానిస్తే వీరంతా దూరమవుతారని సీనియర్ నేతల ద్వారా చంద్రబాబుకు చెప్పించినట్లు సమాచారం. దీంతో చంద్రబాబు సైతం కోటంరెడ్డి ఆశలకు బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది.

కోటంరెడ్డికి కార్పొరేటర్ల షాక్

నెల్లూరు రూరల్ పరిధిలో 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అందరూ తన అడుగుజాడల్లో నడుస్తారని భ్రమించిన కోటంరెడ్డికి ఇప్పటికే 18 మంది కార్పొరేటర్లు ఝలక్ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీని వీడమని స్పష్టం చేశారు. మా జెండా, అజెండా పార్టీనే అంటూ కోటంరెడ్డికి తెగేసి చెప్పారు. తాజాగా నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపికై న ఆదాల ప్రభాకర్‌రెడ్డికి జై కొట్టారు. మరికొందరు జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ త్వరలోనే గుర్తింపు ఇచ్చిన పార్టీతోనే పయనించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అటు కార్పొరేటర్లే కాదు రూరల్ పరిధిలో ఉండే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సైతం పార్టీతోనే పయనిస్తుండడంతో ఎమ్మెల్యే కోటంరెడ్డి ఏకాకి అయ్యారు. నిన్న మొన్నటి వరకు వాపును బలుపుగా భావించిన కోటంరెడ్డికి షాక్‌ల మీద షాక్‌లు తగిలి దిమ్మతిరిగి మైండ్ బ్లాంక్ అయిందని పరిశీలకులు భావిస్తున్నారు. 'చిలుకా ఏ తోడు లేక ఎటేపమ్మా ఒంటరి నడకా.. తెలిసీ అడుగేసినావె ఎడారంటి ఆశల వెనకా..' అంటూ ఆయన సన్నిహితులు, అభిమానులు విచార గీతం ఆలపిస్తున్నారు.

టీడీపీ ట్రాప్‌లో పడి..

కోటంరెడ్డి ఎపిసోడ్ గమనిస్తున్న టీడీపీకి చెందిన అబ్దుల్‌అజీజ్ నుంచి మాజీమంత్రి సోమిరెడ్డి, బీద రవిచంద్ర, నారాయణ వంటి కీలక నేతలు అతన్ని రాజకీయ సమాధి చేయాలని వ్యూహాత్మకంగా పావులు కదిపారు. వైఎస్సార్‌సీపీలో కోటంరెడ్డి భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉండడంతో టీడీపీ అధిష్టానం వ్యూహాత్మకంగా తమ ట్రాప్‌లో పడేలా చేసింది. గతేడాది నుంచి టీడీపీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగానే వ్యవహరిస్తూ వచ్చాడు. అమరావతి రైతులకు స్వాగతాల నుంచి తరచూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వచ్చి చివరకు పార్టీపైనే నిందలు వేసి బయటకు వెళ్లాడు. అంతవరకు వ్యూహాత్మకంగా పావులు కదిపిన టీడీపీ తమ వలలో చిక్కుకున్న కోటంరెడ్డికి పార్టీలో ఎంట్రీకి చెక్ పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది.

ఆదరించిన పార్టీకే సున్నం

2014 ఎన్నికల ముందు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి రాజకీయంగా ఏ చిన్న పదవి లేదు. విద్యార్థి దశ నుంచి ఉద్యమాలు చేసి గుర్తింపు తెచ్చుకున్న శ్రీధర్‌రెడ్డి అప్పుడెప్పుడో బీజేపీ తరఫున ఎంపీపీ పదవికి పోటీచేసి ఓటమి చెందారు. ఆ పార్టీ నుంచే బహిష్కరణకు గురైన ఆయన సొంతంగా భగత్‌సింగ్ యువమోర్చా పార్టీని పెట్టి ఏడాది కూడా నడిపించలేక కాంగ్రెస్‌లోకి వెళ్లాడు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్‌మెంట్ డైరెక్టర్ పదవి పొందాడు. వైఎస్సార్ మరణం తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచారు. దీంతో ఏకంగా 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. దివంగత వైఎస్సార్ చరిష్మాతో పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభతో రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పార్టీ బలంతో గెలిచిన ఆయన తన బలంగా భ్రమించి మత్తగజంలా వ్యవహరించాడు. ఆదరించి... అందలమెక్కించిన పార్టీకే సున్నం పెట్టడానికి ప్రయత్నించాడు. మూడున్నర ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎమ్మెల్యేగా కోటంరెడ్డికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ప్రజాసేవతో ప్రభుత్వానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాల్సిన ఆయన అధికార మదంతో రౌడీమూకలను నెలవారీ జీతాలతో ప్రోత్సహించి పార్టీలకు అతీతంగా తనకు గిట్టని వారిపై, ప్రత్యర్థులపై దాడులు చేయించి భయభ్రాంతులకు గురి చేశాడు. టీడీపీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీశాడు.

ప్రాణధాన్యం

ప్రపంచీకరణ నేపథ్యంలో మారిన ఆహారపు అలవాట్లతో ఊబకాయం, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి ప్రతి ఒక్కరిని ఆరోగ్యంపై దృష్టి పెట్టేలా చేసింది. రోజు వారీగా తీసుకునే ఆహారాల్లో మార్పులు చేసుకుంటున్నారు. చిరుధాన్యాల వాడకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మార్కెట్‌లో తృణధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా రైతులు సైతం వీటిని పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చిరుధాన్యాలు, సేంద్రియ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఏడాదికేడాదికి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

- తృణధాన్యాలతో ఆరోగ్య సిరి
- జిల్లాలో పెరుగుతున్న వినియోగం
- ప్రస్తుతం 600 ఎకరాల్లో సాగు చేసిన రైతులు
- కలువాయి, వింజమూరు, ఎస్ఆర్‌పురం మండలాల్లో సాగు
- రెండు వేల ఎకరాలకు విస్తరింపజేయాలని అధికారుల లక్ష్యం



తృణధాన్యాలు

నెల్లూరు (పొగతోట): ఒకప్పుడు తృణధాన్యాలే మన పెద్దల ఆహారం. రెండు మూడు దశాబ్దాల క్రితం వరకు సంప్రదాయ ఆహార ధాన్యాలు పండించిన రైతులు.. మారుతున్న కాలానికి అనుగుణంగా కేవలం ధాన్యం పండించడానికి అలవాటు పడ్డారు. తృణధాన్యాలు తిన్న మన పెద్దలు సంపూర్ణ ఆర్యోగంతో ఉండే వారిని గుర్తించిన నేటితరం వాటి వినియోగానికి మొగ్గు చూపుతున్నారు. తృణధాన్యాలుగా పిలిచే జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, ఊదలు, సామలు, అండుకొర్రలను ఇప్పుడు సిరిధాన్యాలుగా మారాయి. మార్కెట్లో తృణధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్‌కు రైతులు వీటి సాగుపై దృష్టి సారిస్తున్నారు. దీంతో ప్రభుత్వం సైతం తృణధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే దిశగా రైతులు చిరు ధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇతర పంటల కన్నా ఖర్చు తక్కువ.. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. దీంతో జిల్లాలో చిరు ధాన్యాల సాగుపై లక్ష్యాలు పెరిగాయి.

పోషకాలతో ఆరోగ్య సిరి

తృణధాన్యాల్లో పోషకాలతో పాటు పీచు పదార్థం ఉండడంతో ఇది గ్లూకోజ్‌ను అధిక మోతాదులో విడుదల చేయదు. దీంతో రక్తంలో షుగర్ అదుపులో ఉండి ఆరోగ్యం మెరుగు పడుతుంది. దీంతో సిరిధాన్యాలకు డిమాండ్ పెరిగింది. కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, సామలు, అరికలను ప్రధానంగా సిరిధాన్యాలు అంటారు. సజ్జలు, వరిగలు, జొన్నలు, రాగులు తదితర వాటిని తటస్థ ధాన్యాలుగా ప్రస్తుతం పిలుస్తున్నారు. వీటిలో విటమిన్లు, పీచు పదార్థాలు, ఐరన్, కాల్షియం, మాంసకృతులు, మాంగనీస్, భాస్వరం, మెగ్నీషియం తదితర పోషకాలు కలిగి ఉన్నాయి. రక్తహీనత ఉన్న వారు, షుగర్ వ్యాధితో బాధపడే వారు సిరిధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తీసుకుంటున్నారు. వీటిలో మాంసకృతులు, ఐరన్ అధికంగా ఉండడం వలన రక్తహీనత నివారణకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. పీచు పదార్థం అధికంగా ఉండడంతో మలబద్ధకాన్ని అరికడుతుంది.

జిల్లాలో 2 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం

ప్రస్తుతం సిరిధాన్యాలు వినియోగించే వారి సంఖ్య పెరగడంతో వాటికి డిమాండ్ అధికంగా ఉంది. కొర్రలు, అండుకొర్రలు, ఆరికలు, ఊదలు సిరి ధాన్యాలు పండించేందుకు అధికంగా నీరు అవసరం ఉండదు. చిన్నపాటి వర్షం పడితే చాలు పంటలు పండుతాయి. దీంతో సిరిధాన్యాలు పండించే రైతులను ప్రభుత్వం ప్రొత్సహిస్తుంది. ప్రభుత్వం జిల్లాలో 2000 ఎకరాల్లో సిరిధాన్యాలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. వ్యవసాయశాఖ అధికారులు జిల్లాలో ప్రస్తుతం 600 ఎకరాల్లో సిరి ధాన్యాలు సాగు చేసేలా చర్యలు చేపట్టారు. కలువాయి, వింజమూరు, ఎస్ఆర్‌పురం తదితర మండలాల్లోని రైతులు సిరి ధాన్యాలు సాగు చేస్తున్నారు. గతంలో అనంతపురం నుంచి సిరిధాన్యాలను దిగుమతి చేసుకునే వారు.

2 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం



జిల్లాలో రెండు వేల ఎకరాల్లో సిరి ధాన్యాలు సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ప్రస్తుత సీజన్‌లో 600 ఎకరాల్లో సిరి ధాన్యాలు సాగు చేసేలా చర్యలు తీసుకున్నాం. వచ్చే సీజన్‌లో లక్ష్యానికి మించి సాగు చేసేలా చర్యలు తీసుకుంటాం. వీటి సాగుకు ఖర్చు తక్కువ. ఆదాయం అధికంగా వచ్చే అవకాశం ఉంది.

– సుధాకరరాజు, వ్యవసాయశాఖ జేడీ

సిరిధాన్యాల సాగు పెంచాలి



వరిసాగు చేసుకుంటున్న రైతులకు ధరలు లభించడం లేదు. సిరిధాన్యాలకు ప్రస్తుతం అధిక డిమాండ్ ఉంది. వీటి సాగు విస్తీర్ణం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉత్తర కాలువ పూర్తయితే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. సిరిధాన్యాల సాగుకు ఖర్చు తక్కువ. ధరలు అధికంగా ఉన్నాయి. వీటి సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చిరసాని కోటిరెడ్డి, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు

తప్పనిసరిగా ఈ క్రాప్

నమోదు చేసుకోవాలి



తలుపూరుపాడులో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

- జేసీ కూర్మనాథ్

సంగం: పంటలు సాగు చేసే రైతులు ప్రతి ఒక్కరూ తప్పకుండా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని తలుపూరుపాడులో ఈ-క్రాప్ నమోదును జేసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 86 శాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. రైతుల సౌలభ్యం కోసం జిల్లాలో 124 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, 140 రైస్‌మిల్లులను ట్యాగ్ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బ్యాంక్ గ్యారెంటీ విషయంలో ఎటువంటి సమస్యలు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ తెలిపారు. అనంతరం కొరిమెర్ల సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దారు లక్ష్మీప్రసన్న, వ్యవసాయాధికారి శ్రీహరి, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. జెడ్పీ భవనంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. జెడ్పీ భవనానికి మరమ్మతులను చేయిస్తున్నామని వివరించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, అదే విధంగా సిబ్బంది తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్‌లో టాపర్లు

నెల్లూరు (టౌన్): ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన తొలి విడత జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాలు మంగళవారం ఎన్ఐటీ విడుదల చేసింది. ఈ పరీక్ష గత నెల 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 8 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. జేఈఈ మెయిన్స్‌లో జిల్లాలో పలువురు టాపర్లుగా నిలిచారు. అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన వివిధ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

కంప్యూటర్స్ ఇంజినీరింగ్ చేస్తా



ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 454 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్‌లో 99.94 పర్సంటైల్ సాధించాను. జేఈఈ అడ్వాన్స్ డ్‌లో కూడా మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో కంప్యూటర్స్ ఇంజినీరింగ్ చదవాలన్నదే లక్ష్యం.

– మృదుల కృష్ణారెడ్డి, గూడూరు

ఐఐటీలో చేరుతా



ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 455 మార్కులు సాధించాను. జేఈఈ మెయిన్స్‌లో 99.90 పర్సంటైల్ వచ్చింది. జేఈఈ అడ్వాన్స్ డ్‌లో మంచి మార్కులు సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్ చదవాలని ఉంది.

– శ్రీవాత్సవ్‌రెడ్డి, వేదాయపాళెం

ఐఐటీ చదవాలన్నదే లక్ష్యం



10వ తరగతిలో 456 మార్కులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 464 మార్కులు సాధించాను. జేఈఈ మెయిన్ పరీక్షలో 99.99 పర్సంటైల్ వచ్చింది. ఐఐటీలో చదవాలన్నదే నా లక్ష్యం.

– ఆర్.మేఘనారెడ్డి, రామ్మూర్తినగర్, నెల్లూరు

మంచి ఐఐటీలో చదువుతా



ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 461 మార్కులు సాధించాను. జేఈఈ మెయిన్ పరీక్షలో 99.97 పర్సంటైల్ వచ్చింది. ఉత్తమ ఐఐటీలో ఇంజినీరింగ్ చదవాలన్నదే నా లక్ష్యం.

– రోహిత్ ఆదిత్యసాయి, నవాబుపేట

కలెక్టర్‌కు సీఎస్‌ఆర్‌ నిధుల అందజేత



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న కంపెనీ హెడ్‌

నెల్లూరు(అర్బన్‌): ముత్తుకూరు మండలంలోని పంట పొలం వద్ద ఉన్న సౌతిండియా కృష్ణ ఆయిల్‌ అండ్‌ ఫ్యాట్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీ యూనిట్‌ హెడ్‌ చంద్రమౌళి సీఎస్‌ఆర్‌ కింద రూ.14.5 లక్షలను కలెక్టర్‌ చక్రధర్‌బాబుకు అందించారు. దీనికి సంబంధించిన చెక్కును మంగళవారం నెల్లూరులోని క్యాంప్‌ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఇచ్చారు. ఈ నిధులను కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్‌) కింద అందజేశామని హెడ్‌ తెలిపారు. ఈ సందర్భంగా చక్రధర్‌బాబు మాట్లాడుతూ కృష్ణ ఆయిల్‌ కంపెనీ వారు సీఎస్‌ఆర్‌లో భాగంగా తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జోనల్‌ మేనేజర్‌ మారుతీప్రసాద్‌ పాల్గొన్నారు.

మార్చి నుంచి డీసీపల్లిలో పొగాకు కొనుగోళ్లు

- పొగాకు బోర్డు అధికారుల వెల్లడి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో మార్చి 9వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామని భారత పొగాకు బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ వేణుగోపాల్‌, ప్రొడక్షన్‌ మేనేజర్‌ కృష్ణశ్రీ తెలిపారు. వేలం కేంద్రం పరిధిలో డీసీపల్లి, గుండెమడగల, భైరవరం గ్రామాల్లోని పంటను, క్యూరింగ్‌ చేసిన పొగాకును వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు సాగులో మెళకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. పొగాకు రెల్పులు, క్యూరింగ్‌, గ్రేడింగ్‌లో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రేడింగ్‌లో జాగ్రత్తలు పాటిస్తే మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం పొగాకు బోర్డు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. తుపాన్‌ కారణంగా పొగాకు పంట దెబ్బతిన్న రైతులకు వడ్డీ లేకుండా రూ.10 వేల వంతున రుణం ఇస్తున్నామని తెలిపారు. పంటకు బీమా వచ్చేలా పలు కంపెనీలతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పంట విస్తీర్ణం పెరిగిందన్నారు. సీటీఆర్‌ఐ సూచనల మేరకు అధిక నాణ్యత గల పొగాకును పండించాలని సూచించారు. బ్యారన్‌ లైసెన్సులు ఎవరివైనా పెండింగ్‌ ఉంటే ఈనెల 28వ తేదిలోపు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్‌, ఒంగోలు రీజినల్‌ ఆఫీస్‌ సిబ్బంది సిద్ధిరాజు, రైతు సంఘం నాయకులు నరసప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా

- అనర్హులుంటే చర్యలు తీసుకుంటాం
- కందుకూరు సబ్‌ కలెక్టర్‌ శోభిక



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ శోభిక

కందుకూరు: 'పట్టభద్రుల, టీచర్స్‌ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు కృషి చేస్తున్నాం. అనర్హుల పేర్లు ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎటువంటి అనుమానాలను రాజకీయ పార్టీలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.' అని కందుకూరు సబ్‌ కలెక్టర్‌ శోభిక అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం స్థానిక సబ్‌ కలెక్టర్‌ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో మొత్తం 15 పోలింగ్‌ కేంద్రాలను, టీచర్స్‌ ఎన్నికలకు 5 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రూరల్‌ ఓటర్ల కోసం కేంద్రాలను స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో, పట్టణ ఓటర్ల కోసం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కేంద్రాలను పెడుతున్నామన్నారు. గుడ్లూరులో ఒక పోలింగ్‌ కేంద్రం చిరునామా మార్పుచేసి నూతనంగా జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. 1,400 ఓటర్లు ఉంటే ఒకే పోలింగ్‌ కేంద్రం పెట్టారని, 1,400 ఓటర్లు మించి ఉన్న చోట అదనపు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను సబ్‌ కలెక్టర్‌ కోరారు. సీపీఎం ప్రతినిధులు జి.వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్‌ మాట్లాడుతూ తెలుగులో ప్రచురించిన జాబితాలో పేర్లు తప్పులుగా ఉన్నాయని వాటిని సరిచేయాలన్నారు. ఇంకా పలు విషయాలపై స్పందించిన శోభిక ఓటు కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు విచారించి అర్హత ఉంటేనే ఓటు హక్కు కల్పిస్తారని చెప్పారు. అర్హత లేకుండా ఓటు హక్కు కల్పించి ఉంటే విచారించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనకు ఏ రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధులైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో ఐదు మండలాల తహసీల్దార్‌లు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి నాయీ బ్రాహ్మణుల ధన్యవాదాలు

నెల్లూరు(బృందావనం): దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరమని జిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయిస్‌ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేలూరు రంగారావు, వినుకొండ వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరులోని నవాబుపేటలో మంగళవారం ఆ సొసైటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు సమాజంలో వెనుకబడి ఉన్నట్లు చెప్పారు. దేవస్థానాల్లో జరిగే అన్ని కార్యక్రమాల్లో అర్చకుల తర్వాత ప్రధాన భూమిక పోషించే వీరికి ధర్మకర్తల మండళ్లలో సముచిత స్థానంతో గౌరవాన్ని కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకి ధన్యవాదాలు తెలిపారు.

కుమారుడిని వదిలొస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అబ్దుల్‌ రజాక్‌ (ఫైల్‌)

బుచ్చిరెడ్డిపాళెం: కొడుకును కళాశాలలో వదిలి ఇంటికెళ్తుండగా.. దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్దుల్‌ రజాక్‌ (49) అనే వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని దామరమడుగు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు, ఎస్సై వీరప్రతాప్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఆత్మకూరుకు చెందిన అబ్దుల్‌ రజాక్‌ కుమారుడు నెల్లూరులోని ఓ కాలేజీలో చదువుతున్నాడు. అతడిని వదిలేందుకు ఇద్దరూ స్కూటీపై వెళ్లారు. కాలేజీ వద్ద కొడుకును వదిలాక రజాక్‌ తిరిగి సొంతూరికి బయలుదేరాడు. దామరమడుగులో రోడ్డుమార్జిన్‌ వద్ద ముక్కు నాగేశ్వరరావు అనే వ్యక్తి తన మోటార్‌బైక్‌ను ఆపి నిలబడి ఉన్నాడు. ఆ దారిలో వెళ్తూ రజాక్‌ నాగేశ్వరరావు బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. నాగేశ్వరరావు గాయపడగా చికిత్స నిమిత్తం ప్రైవేట్‌ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో మహిళకు ఏడాది జైలు

నెల్లూరు(లీగల్‌): ఇంట్లో గంజాయి ఉందని నమోదైన కేసులో నిందితురాలు అరవ రాజమ్మకు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు స్పెషల్‌ ఎక్సైజ్‌ కోర్టు న్యాయమూర్తి సుయోధన్‌ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ కథనం మేరకు.. నెల్లూరు వన్‌టౌన్‌ ఎస్‌ఈబీ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు 2017 సంవత్సరం జూన్‌ ఆరో తేదీన మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నెల్లూరు నగరంలోని కపాడిపాళెం ప్రాంతానికి చెందిన అరవ రాజమ్మ ఇంటిని తనిఖీ చేయగా 440 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఎస్‌ఈబీ అధికారులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం ఆమెపై కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ తరఫున ఏపీపీ లీలాకుమారి కేసు వాదించారు.

సరదాగా బోటులో వెళ్లి..



యువకులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

- సముద్రంలో చిక్కుకున్న యువకులు
- 112కి ఫోన్‌ చేసి సమాచారం ఇచ్చిన వైనం
- కాపాడిన పోలీసులు

కావలి రూరల్‌: వారంతా సరదాగా మత్స్యకారుల బోటులో సముద్రంలోకి వెళ్లారు. కాసేపటికి బోటు ఆగిపోవడంతో చిక్కుకుపోయారు. 112 నంబర్‌కు ఫోన్‌ చేయగా పోలీసులు మరో బోటులో వెళ్లి కాపాడారు. డీఎస్పీ ఎం.వెంకటరమణ కథనం మేరకు.. కావలి పట్టణం, బోగోలు మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన తొమ్మిదిమంది యువకులు మంగళవారం కావలి రూరల్‌ మండలం చెన్నాయపాళెం సముద్ర తీరానికి వెళ్లారు. ఒడ్డున కొంతసేపు ఉన్నారు. తర్వాత సరదాగా సముద్రంలోకి వెళ్లానని నిర్ణయించుకుని అక్కడున్న మత్స్యకారుల సహాయంతో బోటులో ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. ఆ సమయంలో బోటు మోటార్‌ చెడిపోయింది. తీసుకెళ్లిన వ్యక్తి మద్యం మత్తులో ఉండటంతో యువకులంతా భయాందోళనకు గురై వెంటనే 112 ఫోన్‌ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే కావలి రూరల్‌ సీఐ రాజేష్‌ సిబ్బందితో కలిసి తీరానికి వెళ్లారు. మరో బోటులో బాధితుల వద్దకు వెళ్లి వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. డీఎస్పీ అక్కడికి చేరుకుని యువకులకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఆయన వెంట ఎస్సై వీరేంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కావలి రూరల్‌: పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. ఒకటో పట్టణ ఎస్సై ఎం.గోపిచంద్‌ కథనం మేరకు.. పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో ఓ వ్యక్తి పురుగుమందు తాగి చనిపోయి ఉన్నాడని ఆ ప్రాంత వీఆర్వో బూచి అవినాష పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. అక్కడ ఏ ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఒకటో పట్టణ పోలీసులకు తెలియజేయాలని ఎస్సై కోరారు.

ఆయిల్‌ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

నెల్లూరు(క్రైమ్‌): ఏపీ పీటీడీ (ఆర్టీసీ) నెల్లూరు జిల్లా పరిధిలోని ఏడు డిపోల్లో ఉన్న బస్సులకు హెచ్‌ఎస్‌డీ ఆయిల్‌ సరఫరా చేసేందుకు ఆసక్తి ఉన్న రిటైల్‌ యజమానుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పీవీ శేషయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్‌ నిబంధనలు, ఫారాలు, ఇతర వివరాల కోసం ఈనెల 13 నుంచి 22వ తేదీలోపు అన్ని డిపో కార్యాలయాల్లో పనివేళల్లో సంప్రదించవచ్చని సూచించారు. సీల్డ్‌ టెండర్‌ ఫారాలను ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల వరకు నెల్లూరు జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్‌ బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు టెండర్‌దారుల సమక్షంలో బాక్స్‌ను తెరుస్తామన్నారు. ఎలాంటి కారణం చూపకుండానే టెండర్‌ను తిరస్కరించడం, రద్దు చేసే అధికారం కమిటీకి ఉంటుందని తెలియజేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	:రూ.40
సన్నవి	:రూ.30
పండ్లు	:రూ.10



పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ (లైవ్‌)	: 102
లేయర్‌ (లైవ్‌)	: 80
బ్రాయిలర్‌ చికెన్‌	: 184
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 204
లేయర్‌ చికెన్‌	: 136

